సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 08 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 10.04.2025




# పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఈ పథకానికి ఏడాదికి రూ.13,500 కోట్లు
- ఎస్సీకాలనీలో భోజనం చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే

2 లో







General News



# చివరి ఆయకట్టుకు నీరందాలి

- **దేవాదుల ప్రాజెక్టు ప్రాధాన్యత కలది**
- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**జనగామ, మన చౌరాస్తా :** దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌తో కలిసి కడియం దేవాదుల ఎత్తిపోతల పథకం కింద భూసేకరణ ప్రక్రియ, పెండింగ్ పనుల పురోగతి, సాగు నీటి సరఫరాపై నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారానే ఘనపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సాగుకు నీరు అందుతోందని, యుద్ధప్రాతిపదికన దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ప్రతి నెల సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మల్లన్న గండి లిఫ్ట్ 1, లిఫ్ట్2 పనులను జులై లోగా పూర్తిచేసి, సాగు నీరు అందించాలన్నారు. డిసెంబర్ లోపు అశ్వరావుపల్లి ప్రధాన కుడి కాలువ పనులు పూర్తి కావాలన్నారు. ఆర్ఎస్ ఘనపూర్ నుంచి నవాబ్ పేట ప్రధాన కాలువ సీసీ లైనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అన్ని డిస్ట్రిబ్యూటరీస్ లలో, మైనర్ కెనాల్స్ లలో గుర్రపుడెక్క, చెత్త చెదారాలను తొలగించాలని, కెనాల్ లను బలపర్చాలని, రెగ్యులేటర్స్, షెటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం తీవ్రమైన కరువు ప్రాంతమని, దేవాదుల ప్రాజెక్టు చేపట్టిన తర్వాతనే సాగుకు, తాగు నీటికి ఇబ్బందులు లేవని వెల్లడించారు. దేవాదులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పెండింగ్ పనులన్నీ వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నీటి నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్డీసీలు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ ఏజెన్సీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ

- **స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
- **ఎస్సీకాలనీలో భోజనం చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే**



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** పేదల కడుపు నింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని, ఇది విప్లవాత్మక నిర్ణయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్యతో కలిసి నియోజకవర్గంలోని ఎస్సీ కాలనీలోని లబ్ధిదారులు తాటికొండ యాదమ్మ ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశంలోనే మొదటిసారిగా పేదలు కడుపునిండా అన్నం తినాలనే ఒక మంచి ఆలోచనతో ఎక్కడా లేని విధంగా ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఇదొక విప్లవాత్మకమైన నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి ఈ పథకంపై రూ.13,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంతకుముందు సన్న బియ్యం తినాలని ఉన్నప్పటికీ, ఆర్థిక స్థితిగతుల మూలంగా ఎందరో పేదలు దొడ్డు బియ్యం తింటున్నారని, అలాంటి వారి కోసం ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేసి, పేదల ఆశలను నెరవేరుస్తోందని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి పేదవాడికి నాణ్యత గల ఆహారాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని 335 రేషన్ దుకాణాల ద్వారా 1,61,264 రేషన్ కార్డుల లబ్ధిదారులకు 3,151 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని, ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** ప్రపంచ ఆరోగ్య దినం పురస్కరించుకుని బుధవారం ఓబుల్ కేశవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ, జనగామ సంయుక్తంగా కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో వైద్య, కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీ సి.విక్రం ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులకు ఈ వయసులో తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటన్నిటికి భయపడకుండా తరచుగా సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో కావూరి మల్లిఖార్జున్ రావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో కంటి చూపు మందగిస్తుందని, బీపీ, షుగర్, కీళ్ల సమస్యలు, కాటరాక్ట్ వంటి సమస్యలు వస్తాయని వీటన్నిటికి భయపడకుండా పరీక్ష చేయించుకుని శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలు ప్రభుత్వ సహాయంతో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రవీందర్ గౌడ్, వృద్ధాశ్రమం ఇంచార్జ్ డి.లక్ష్మణ్, జిల్లా సంక్షేమ అధికారిని ఫ్లోరెన్స్ , ఓబుల్ కేశవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వి.ప్రవీణ్ కుమార్, డా.బి.శ్రీతేజ, డా.మౌనిక, అప్తాల్మిక్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.




# గోవు హత్య చేసిన దుండగులను గుర్తించి శిక్షించాలి

**జనగామ, మన చౌరాస్తా :** శామీర్‌పేట్ రోడ్డులో ఉన్న రైతు అన్నెడ్డి పురుషోత్తం రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గర్భంతో ఉన్న పాడి గోవు హత్య చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ డిమాండ్ చేశారు. గోహత్య విషయం తెలిసిన వెంటనే బుధవారం తెల్లవారుజామున ఘటన స్థలానికి చేరుకొని ఆయన పరిశీలించారు. శాలలో కట్టేసివున్న గోవు తాడు తెంచి, అక్కడే ఉన్న గొడ్డలితో గర్భంపై, వెనుక భాగంపై అతి కిరాతకంగా దాడి చేసి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత కిరాతకంగా, మానవత్వ విలువలు మంటగలిపే దుశ్చర్యకు పాల్పడిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. ఆయన వెంట కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, చిక్కుడు నగేష్ ఉన్నారు.



Local News




# రైతాంగ పోరాటాల దిక్సూచి ఏఐకేఎస్

జనగామ రూరల్, మన చౌరాస్తా : దేశంలో స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్ సభ పురుడుపోసుకున్నదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం మరిగడి గ్రామసభ జిల్లా నాయకులు బోడ రాములు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ హాజరై మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని 1936 ఏప్రిల్ 11 తేదీన అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటైందన్నారు. ఆనాడు దేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దేశ రైతంగానే స్వతంత్ర ఉద్యమ స్రవంతిలోకి తీసుకురావడానికి ముఖ్య భూమిక పోషించిందని ఆనాటి పోరాట స్ఫూర్తి అదేవిధంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో దేశంలో దేశ రైతన్ననికి బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని గిట్టుబాటు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, విద్యుత్ సంస్కరణలు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. జనగామ మార్కెట్లో రైతుల ధాన్యానికి కనీస మద్దతు ధర 1850 రూపాయలకు కొనుగోలు చేయాలని, మార్కెట్ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరిపించాలని దోషులను కఠినంగా శిక్షించాలని,



మరిగడి గ్రామంలో పశువుల దవఖాన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల బాధ్యులు రమావత్ మీట్యా నాయక్, కూరాకుల శ్రీను, కాసాని మల్లేష్, కూరాకుల సమ్మయ్య, కూకట్ల నరసయ్య, సంఘీ బాలమల్లయ్య, కంతి కొమురయ్య, కూరాకుల ఉప్పలయ్య, కూరాకుల యాదగిరి, పల్లపు వెంకటయ్య, కట్ట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కూరాకుల సమ్మయ్య, కార్యదర్శిగా కాసాని మల్లేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# సంఘంతో మానవ సంబంధాలు మెరుగు

జనగామ, మన చౌరాస్తా : ఉపాధ్యాయ పరపతి సంఘం ఆధ్యర్యంలో అధ్యక్షుడు బండోజు ఆంజనేయులు అధ్యక్షతన ఎన్ఎంఆర్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సంఘం ఏర్పాటై సుమారు ఇరవై అయిదు సంత్సరాలుగా కొనసాగుతూ వస్తుంది. ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన, పొందుతున్న జనగామ మాజీ మండల విద్యాదికారి వంగల రాజేందర్, వెంకిర్యాల హెడ్మాస్టర్ బత్తిని చొక్కయ్య, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ ఖదీరుద్దీన్‌ను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదులకంటి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పరపతి సంఘం ద్వార ఆర్థిక ప్రయోజనాలే కాకుండా, కుటుంబ, మానవ సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు, సమాజానికి ఎన్నో సేవలు అందించారని తెలిపారు. వారిని అభినందించారు. సమావేశంలో అంబటి రాజయ్య, బూడిద సుధాకర్, టి. శ్రీనివాస్, దూడల రమేష్, ఇ .భుజంగ రెడ్డి, ఉప్పలయ్య, పి.మల్లా రెడ్డి, ఎం.లింగం, అశోక్, మల్లేశం పాల్గొన్నారు.




# నీతి, నిజాయితీ ఉండాలి

- దళితులు, ఎస్టీలు నిన్ను బొందపెడతరు
- కడియం దౌర్జన్యంపై పల్లా ఆగ్రహం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బీఆర్ఎస్ పట్టణ దళిత నాయకుడు తిప్పరపు విజయ్‌ను అక్రమంగా జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో నిర్బంధించిన ఘటనపై బుధవారం ములాకాత్ తీసుకోని ఆయనను జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. కడియం శ్రీహరి తన వయసుకు తగ్గట్టుగా ప్రవర్తించకపోవడంపై, తనపై వ్యక్తిగతంగా వెదవ, బొచ్చు కుక్క వంటి అభ్యంతరకర పదాలతో తిట్టిన విషయం కొంతమంది కార్యకర్తలు నాయకులు తట్టుకోలేకపోయారు. ఈ తిట్లపై సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేకంగా వచ్చిన పోస్ట్ ను కొందరు కార్యకర్తలు షేర్ చేశారు. కేవలం అదే కారణంగా స్టేషన్ ఘన్‌పూర్, జనగామ ప్రాంతాల్లో ముఖ్యంగా దళిత యువకులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం దారుణం అన్నారు. నీతి, నిజాయితీ ఉంటే కడియం శ్రీహరి నువ్వు చట్టబద్ధంగా మాట్లాడాలి.. పోలీసుల మద్దతుతో దుర్వినియోగం చేస్తూ ప్రజలను జైలులో పెట్టడం క్షమించరని చర్య అంటూ ఆయన హెచ్చరించారు. విజయ్‌ను జైలులో పెట్టినంత మాత్రాన ఉద్యమం ఆగదని, మేం చట్టపరంగా బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని, నిజంగా మమ్మల్ని అరెస్ట్ చేయాలనుకుంటే రాష్ట్రంలో ఉన్న అన్ని జైళ్లూ చాలవు అని స్పష్టం చేశారు. ఇటీవల దళిత ఉత్సవాల సందర్భంగా దళిత యువకులపై జరుగుతున్న దాడులు బాధాకరమని పేర్కొన్నారు. కడియం శ్రీహరి దళితుల పేరును వినిపించుకుంటూ దళిత దొరగా ప్రవర్తిస్తున్నాడని, ఆయన చర్యలు దళిత సమాజాన్ని తీవ్రంగా కలచి వేస్తున్నాయి. దళితులు, ఎస్టీ యువకులు ఆయనను బొంద పెట్టేదాకా ఊరుకోరన్నారు.

# నీళ్లు అందించే బాధ్యత నాది

**జనగామ రూరల్, మన చౌరాస్తా :** జనగామ మండలం పెంబర్తి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గతంలో కూడా పెంబర్తి రైతులు ఈ యాసంగికి బొమ్మకూరు నుంచి కుడి కెనాల్ ద్వారా నీళ్లు అందటం లేదని తన దృష్టికి తీసుకవచ్చారని, కొంతవరకు ప్రయత్నం చేసాం.. కానీ అందలేదు.. కొన్ని పంటలు ఎండిపోయినయ్.. దేవాదుల్లో 3వ పేస్ మోటార్లు మొదలయ్యాయి.. మొదటి పేస్ 350 క్యూసెక్కులు ఉంటుంది.. రెండవ పేస్ 550క్యూసెక్కులు ఉంటుంది.. 3వ పేస్ 1800క్యూసెక్కులతో నీరు వస్తుందన్నారు. భవిష్యత్ లో రెండు పంటలకు నీరు వస్తుందన్నారు. రాకపోతే అధికారులతో తాను కూడా మాట్లాడుతా.. తనకు ఏ సమస్య వచ్చినా రెండు రోజులు ముందు నా దృష్టికి తీసుకరండి కోరారు. పెంబర్తి రైతులు అందరూ చాలా కష్ట పడి సిరి సంపాదలతో ఉండాలని ఆ దేవుడిని కోరుకుంటునని పేర్కొన్నారు.

